చెక్‌పోస్టుల్లో నిఘా కరువు



తనిఖీలు లేని కొడికొండ సరిహద్దు చెక్‌పోస్ట్

- జోరుగా కర్ణాటక మద్యం, మత్తు పదార్థాలు అక్రమ రవాణా
- ఇసుక, మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని పోలీసులు

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ల్లో నిఘా కొరవడింది. యథేచ్ఛగా అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కర్ణాటక మద్యం, కలప, మత్తు పదార్థాలు, రేషన్ బియ్యం, గోవులను తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు.

జిల్లాలోకి కర్ణాటక మద్యం

44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీని పోలీసులు అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం సెబ్‌ను కాస్తా ఎక్సైజ్‌గా మార్చాక కనీసం తనిఖీలు కూడా నిర్వహించడం లేదు. దీంతో జాతీయ రహదారులు, రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 44వ నంబరు జాతీయ రహదారిలోని కొడికొండ చెక్‌పోస్ట్, లేపాక్షి మండలంలోని సరిహద్దులు, హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట చెక్‌పోస్ట్‌ల్లో అక్రమ రవాణా సాఫీగా సాగిపోతోంది. ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక నేతలు మొదలు బడా నేతల కనుసన్నల్లో మొదలైన ఇసుక, మట్టి, మద్యం రవాణా నేటికీ సాగుతోంది. మన రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో కర్ణాటకలో దొరికే బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటక మద్యం రాష్ట్రంలోకి వస్తోంది. ఎక్కడా తనిఖీలు లేకపోవడంతో మద్యం ఏరులైపారుతోంది. ప్రధాన రహదారులే కాకుండా లింక్ రోడ్లు కూడా ఉండటంతో అక్రమంగా రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతోంది.

మత్తు పదార్థాలకు అడ్డేదీ?

44వ నంబరు జాతీయ రహదారి రాష్ట్ర సరిహద్దులో కొడికొండ చెక్‌పోస్ట్ ఉంది. ఎంతో పటిష్ట భద్రత ఉండాల్సిన చోట పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది వీలున్నప్పుడు మాత్రమే తనిఖీ చేస్తుంటారు. ప్రత్యేకించి ఎక్సైజ్ స్టేషన్ ఉన్నా తనిఖీలు మాత్రం ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు మత్తు పదార్థాలు రవాణా కూడా జోరుగా సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని విద్యాసంస్థలు ఉన్న చోటల్లా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని సమాచారం. పురంలోని ఎంజీఎం మైదానం, రైల్వేస్టేషన్ పరిసరాల్లో మత్తు పదార్థాలు ఎక్కువగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. టీస్టాల్స్‌లో కూడా గుట్టుచప్పుడు కాకుండా మత్తు పదార్థాలు విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. యువత లక్ష్యంగా సాగుతున్న ఈ మత్తు పదార్థాల దందాపై పోలీసులు ప్రత్యేక నిఘా లేకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.

అక్రమంగా ఇసుక తరలింపు

కూటమి ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక తరలించుకోవచ్చన్న ప్రభుత్వ ఆదేశాలు కూటమి నాయకుల పాలిట కల్పతరువుగా మారింది. నియోజకవర్గంలో ఉన్న మండలాల్లోనే కాకుండా ఇక్కడి ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని నదుల్లో ఉండే ఇసుకను తోడేస్తుండటంతో రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సరిహద్దులపై నిఘా ఉంచి, అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

క్లుప్తంగా

భూ వివాదంతో పంట ధ్వంసం



మల్బరీ పంటను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామ పొలంలో ఇద్దరు రైతులు మధ్య భూ వివాదం చోటు చేసుకుంది. రాజారెడ్డి సంబంధించిన పొలంలో సానిపల్లి గ్రామానికి చెందిన పీటీ రంగప్ప మనవడు సురేష్ వ్యవసాయం చేసుకుంటున్నారు. సురేష్‌కు సంబంధించిన పొలంలో రాజారెడ్డి ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే అధికారుల తప్పిదంతో రైతుల భూమికి సంబంధించి లెటర్లు మరిపోయాయంటున్నారు. దీంతో వివాదం చోటు చేసుకుంది. మంగళవారం రెండు ఎకరాల్లో తాను సాగు చేసిన మల్బరీ పంటను సురేష్ జేసీబీతో ధ్వంసం చేసినట్లు రాజారెడ్డి ఆరోపించారు. అధికారులు భూవివాదం పరిష్కారమయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

హిందూపురం టౌన్: కారుణ్య నియామకాల్లో జాప్యం వలన చనిపోయిన ఉపాధ్యాయుల వారసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలో మంగళవారం ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిటీ నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 మేరకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. నాయకులు రమణారెడ్డి, రామాంజనేయులు, చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక సంచిక విడుదల



మ్యాగజైన్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: కళాశాలలో చదువుతున్న విద్యార్థినులను ప్రోత్సహించి, వారిలో ఉన్న సృజనను వెలుగులోకి తీసుకురావడం కోసం కుముద్వతి పేరుతో కళాశాల మ్యాగజైన్ తీసుకురావడం అభినందనీయమని ప్రముఖ కవి, రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన కుముద్వతి (స్థానికంగా కుందేరు) కళాశాల వార్షిక సంచిక విడుదల కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీలక్ష్మీ, శ్రీధర్, యశోదాదేవి, ప్రకాష్ రావు, భోజప్ప, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు అభివృద్ధికి పాటుపడదాం



నూతన న్యాయమూర్తిని కలసిన న్యాయవాదులు

పెనుకొండ: కలసి కట్టుగా కోర్టు అభివృద్ధికి పాటుపడుదామని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో మంగళవారం పుట్టపర్తి నుంచి పెనుకొండకు నూతనంగా బదిలీపై వచ్చిన న్యాయమూర్తి రాకేష్‌కు సీనియర్ సివిల్ జడ్జితో పాటు జూనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ పీపీ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాదులు అశ్వర్థనారాయణ, లక్ష్మీనారాయణ, శర్మ, నాగిరెడ్డి, జావీద్, గౌతమి, ప్రేమ పాల్గొన్నారు.

కబ్జాదారుడి నుంచి రక్షించండి

హిందూపురం టౌన్: లేపాక్షి మండలం కొండూరు గ్రామ రెవెన్యూ పొలం సర్వే నంబర్ 165–3లో తమ తండ్రి పేరుపై సర్వ హక్కులు ఉన్న నాలుగు ఎకరాల సాగు భూమిని నారాయణరెడ్డి అనే భూస్వామి దౌర్జన్యంగా కబ్జా చేశారని బాధితులు రత్నమ్మ, ముత్యాలమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 2024లో తమ తండ్రి అంజనప్ప చనిపోయారన్నారు. అయితే మీ తండ్రి వద్ద నుంచే భూమి కొనుగోలు చేశానని నారాయణరెడ్డి అబద్ధాలు చెబుతున్నారన్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా తమ తండ్రి భూమి ఎలా అమ్ముతారని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఆయన నుంచి తమకు రక్షణ కల్పించి భూమిని కాపాడాలని వేడుకున్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొందిలో మంగళవారం డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో సిబ్బంది కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇళ్లు, వివిధ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ప్రశాంత వాతవరణంలో జీవనం సాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత మడకశిర పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని డీఎస్పీ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐలు నగేష్‌బాబు, రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ నరసింగప్ప మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన పలు రికార్డులు తనిఖీ చేశారు. పలు కేసుల విషయాలపై ఎస్ఐ నరేంద్రతో అడిగి తెలుసుకున్నారు.

అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐడీఎస్ఓ నాయకురాలు పూర్ణిమ

హిందూపురం: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ అన్నారు. ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ముగింపు కార్యక్రమాన్ని స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. నేటి ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలు కల్పించక, ప్రజల బాగోగులు పట్టించుకోకుండా స్వార్థపూరిత రాజకీయాలతో దేశాన్ని నాశనం చేస్తున్నారని నాయకులు వాపోయారు. ఏఐడీఎస్ఓ జిల్లా నాయకురాలు పూజిత, సభ్యులు పూర్ణిమ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శతాధిక వృద్ధుడి పుట్టినరోజు



హనుమంతప్పను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి న్యాయదకుంటి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు హనుమంతప్ప 106వ పుట్టిన రోజును మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రముఖులు ఆయన్ను ఘనంగా సన్మానించి స్వీట్లు పంచారు. జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎస్ఏ ఈరణ్ణ , తిప్పేస్వామి, ప్రవీణ్, హనుమంతరాయ, వసంత్, శేఖర్, హరీశ్, నరసప్ప, రామాంజి, హనుమంతరాయప్ప, సిద్ధప్ప, రామణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధికి చేసింది శూన్యం

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 11 నెలల్లో ఆర్భాటం, అబద్ధాలు, మోసాలు తప్ప మడకశిర ప్రాంత అభివృద్ధికి చేసింది శూన్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్ నాయకులతో కలిసి సమన్వయకర్త ఈరలక్కప్ప మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోటుబడ్జెట్ లేకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దశల వారీగా ఇక్కడి రైతులకు 300 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారన్నారు. అయితే సీనియార్టీని పక్కన పెట్టి టీడీపీ నేతలు ఎవరికి చెబితే వారికే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం సరి కాదన్నారు. పెట్టుబడిసాయం రూ.20 వేలు ఇస్తామని నేటికీ హామీని అమలు చేయకపోవడంతో రైతులు అప్పులు చేసి పంట సాగుచేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా బైపాస్ కెనాల్‌కు రూ.214 కోట్లు నిధులు మంజూరు చేసి టెండర్లను కూడా పిలిచారన్నారు. అయితే కూటమి నాయకులు తామే బైపాస్ కెనాల్ మంజూరు చేయించామని ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. గతంలో అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు.

కుట్టు మిషన్ల పేరుతో దోపిడీ

కుట్టు మిషన్ల, ట్రైనింగ్ పేరుతో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతోందని, బీసీ మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్ విమర్శించారు. కుట్టు మిషన్ల పేరుతో కూటమి ప్రభుత్వం రూ.238 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది మహిళలకు అయ్యే ఖర్చు కేవలం రూ.73 కోట్లు కాగా మిగిలిన రూ.165 కోట్ల మొత్తాన్ని దోచుకుంటోందన్నారు. అలాగే ఆర్య వైశ్య, క్షత్రియ, కాపు, కమ్మ కార్పొరేషన్ల కింద రూ.115 కోట్ల మంజూరుకు సిద్ధం చేసి రూ.81.5 కోట్లు దోచుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పథకాల పేరుతో దోపిడీని మానుకొని ప్రజలకు పారదర్శక పాలన అందించాలన్నారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణయాదవ్, నియోజకవర్గ స్థాయి వివిధ విభాగాల అధ్యక్షులు మల్లికార్జున, శేషాద్రి, సుధాకర్, నరసింహ, సికిందర్, న్యాయవాది మూర్తి, నాయకులు జయరాజ్, రంగనాథ్, శ్రీరామప్ప, రాజశేఖర్, తిప్పేస్వామి, గోవిందప్ప, శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం

పావగడ: పట్టణంలోని కుమార స్వామి లే అవుట్‌తో పాటు గుట్టహళ్లి వార్డులో నూతనంగా నిర్మించిన నూతన అంగనవాడీ కేంద్రాలను ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమాలలో మున్సిపల్ అధ్యక్షుడు జీ సుదేశ్ కుమార్, ఉపాధ్యక్షురాలు గీతా హనుమంతరాయప్ప, మాజీ అధ్యక్షుడు రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు విరిగిపడి వ్యక్తికి గాయాలు

రొద్దం: మండల పరిధిలోని పాతర్లపల్లి వద్ద పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై చెట్టు కొమ్మ విరిగిపడటంతో శివప్రసాద్ అనే వ్యక్తి తలకు గాయలైనట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాయంలో విధులు నిర్వహించడానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా కొమ్మ విరిగి పడిందన్నారు. శివప్రసాద్‌ను 108 వాహనంలో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 81.25 శాతం ఉత్తీర్ణత

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో 81.25 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు. 80 మందిలో 65 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇందులో 42 మంది ఫస్టక్లాస్, పది మంది జిల్లా స్థాయి, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత అయ్యారన్నారు.

భూ బాధితుల నిరసన

పెనుకొండ: పట్టణంలోని రామమందిరం వీధిలోని పద్మనాభరావు కుమారుడు కృష్ణారావు ఇంటి వద్ద రొద్దం మండలం ఆర్‌ఎల్ కొత్తూరు గ్రామ భూబాధితులు మంగళవారం నిరసనకు దిగారు. కొత్తూరులో వారి అనుభవంలో ఉన్న భూములను కొందరు రైతులతో డబ్బులు తీసుకుని 2008లో అమ్మారన్నారు. ప్రస్తుతం భూయజమానులు కృష్ణారావు వారి సోదరులు ఉమ్మడిగా వన్‌బీ చేయించుకుని ఆ భూములను ఇతరులకు అమ్మివేశారన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది నిరసన ప్రాంతానికి చేరుకుని రైతులను డీఎస్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అనంతరం డీఎస్పీ నరసింగప్ప తన కార్యాలయంలో రైతుల నుంచి పూర్తి సమాచారం తెలుసుకున్నారు.

జాతీయ మెగా లోక్‌అదాలత్ వాయిదా

హిందూపురం టౌన్: రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించే నిమిత్తం ఈ నెల 10న నిర్వహించాల్సిన జాతీయ మెగా లోక్ అదాలత్ వాయిదా పడినట్లు జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ తెలిపారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలతో మెగా లోక్ అదాలత్ వాయిదా పడిందన్నారు. జూలై 5న జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందన్నారు.

వాహనదారులకు జరిమానా

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన రికార్డులు, హెల్మెట్ లేని ప్రయాణం చేస్తున్న 15 మంది ద్విచక్ర వాహనదారులకు రూ.7,750 జరిమాన విధించినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. అలాగే మద్యం తాగి ఆటోలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు.

కొండూరులో కార్డెన్ సెర్చ్

లేపాక్షి: మండల పరిధిలోని కొండూరులో ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లతో పాటు రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లను తనిఖీ చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రొళ్ల: మండల పరిధిలోని బంద్రేపల్లిలో ఈనెల 9న గురుకృప షోషిత నాటిక మండలి ఆధ్వర్యంలో 'కురుక్షేత్ర అథవ శ్రీకృష్ణ సందాన' అనే కన్నడ పౌరణ నాటిక ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, తిప్పేస్వామి, కరియన్న, రాజన్న తదితరులు గుడిబండ మండలం ఫళారం గ్రామాన్ని చేరుకుని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పతో నాటిక ప్రదర్శన పోస్టర్లను విడుదల చేయించారు.

వేడుకగా దీపాల మహోత్సవం



అలంకరణలో మధుగిరి మారెమ్మ

హిందూపురం: పట్టణంలోని సూరప్పకట్ట కింద వాల్మీకి వీధిలోని మధుగిరి మారెమ్మ ఆలయ ఉత్సవాలు, దీపాల మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మారెమ్మ మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మడకశిర ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వీఓ లీడర్లు, వీఓఏలు, సీసీలతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, వడదెబ్బపై అవగాహన కల్పించడంతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

అమరాపురం: మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం రైతులకు వ్యవసాయ పనిముట్లను ఏఓ మంజునాథ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 26 మందికి ఏహెచ్‌టీపీ స్ప్రేయర్లను పంపిణీ చేసినట్లు మంజునాథ తెలిపారు.

కృత్రిమ గర్భధారణతో పాడి ఆవుల అభివృద్ధి

హిందూపురం: మేలుజాతి ఆంబోతుల నుంచి సేకరించిన వీర్యంతో కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పాడి ఆవులను అభివృద్ధికి కృషి జరుగుతోందని డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం అన్నారు. హిందూపురం మండలంలోని బేవినాహళ్లి పంచాయతీ పాడి రైతులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారి మరవకొత్తపల్లి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడూరుకు చెందిన నరసింహమూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. ద్విచక్ర వాహనంలో వెళుతున్న నరసింహమూర్తి చిలమత్తూరు క్రాస్‌లో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో హిందూపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఆశావర్కర్ల సమ్మె నోటీసు



లేపాక్షిలో మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశావర్కర్లు

లేపాక్షి: దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెకు మద్దతుగా తాము కూడా సమ్మెలో పాల్గొంటున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట చిరంజీవికి ఆశా వర్కర్లు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఒప్పంద జీఓలు విడుదల చేయాలని, ప్రభుత్వమే నియమకాలను చేపట్టాలన్నారు. ఆఫీస్ బేరర్స్ రాధమ్మ, పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మెలో తాముకూడా భాగస్వాములవుతున్నట్లు గుండుమల పీహెచ్‌సీ ఆశా కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులుకు మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చారు.

పెనుకొండ: పట్టణంలోని యూపీహెచ్‌లో ఆశా వర్కర్‌లు, సీఐటీయూ నాయకులు వైద్యురాలు రిహానాకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. నాయకులు బాబావలి, నాగరాజు, మహబూబ్‌బాషా, ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో కంపు కంపు



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్వాహణ కరువైంది. భువన విజయం సమావేశపు గది పక్కన ఏర్పాటు చేసిన మరుగుదొడ్డిలో నీటి సౌకర్యంతో శుభ్రత లేకపోవడంతో కంపు కంపుగా మారింది. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోంది.

పర్యవేక్షణ కరువు



గుట్టూరులో అధికారుల పర్యవేక్షణ లేకుండానే జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరు నుంచి మునిమడుగు వరకు దాదాపుగా 5 కిలో మీటర్లు పైబడి కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు ఇష్టానుసారంగా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చించి నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమైపోయారని ప్రశ్నిస్తున్నారు.